


సివిల్ సర్వీసెస్ -2026 పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్, మెయిన్స్) పరీక్షల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల మూడో తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఆర్‌వి.నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా వైట్ రేషన్ కార్డ్, ఆధార్ జిరాక్సులు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో వచ్చే నెల మూడో తేదీ నాటికి వెన్నవల్లివారిపేట బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఫస్ట్ ఫ్లోర్ బిసి స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులకు వచ్చే నెల ఏడో తేదీన రాజమహేంద్రవరంలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అర్హత సాధించినవారికి 14వ తేదీ నుంచి బిసి స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ, బస, భోజన వసతి ఉంటుందని తెలిపారు.



రామం, స్వామినాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసిన నేతలు

ధన్యజీవి ఉద్దరాజు రామం

- మోడీ పాలనలో లక్ష మంది రైతులు ఆత్మహత్య
- కార్పొరేట్లకు రాయితీలు, రైతులకు ఆత్మహత్యలా?
- అఖిల భారత కిసాన్ సభ ఆలిండియా అధ్యక్షులు అశోక్ ధావలె
- వ్యవసాయంలో చైనా విధానం ఆదర్శం
- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య
- రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు
- ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ కార్యదర్శి బి.బలరాం
- ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ సేవలు ప్రారంభం
- ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం



అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జమిందారులకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి కష్టపడి పని చేసిన ఉద్దరాజు రామం ధన్యజీవి అని అఖిలభారత కిసాన్ సభ ఆల్ ఇండియా అధ్యక్షులు అశోక్ ధావలే అన్నారు. రైతాంగ సమస్యలపై రామం పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. స్థానిక ఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్దరాజు రామం 31వ వర్ధంతిని పురస్కరించుకుని రైతాంగ సమస్యలు-ప్రభుత్వాల బాధ్యత' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. తొలుత అల్లూరి సాంస్కృతిక కేంద్రం ప్రాంగణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, ఉద్దరాజు రామం, స్వామినాథన్ చిత్రపటాలకు అశోక్ ధావలే, వి.కృష్ణయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామం ఫౌండేషన్ సభ్యులు, రైతు కార్యాచరణ సమితి నేతలు, రైతుసంఘాల నేతలు, వరి, ఆక్వా రైతులు, మేధావులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెమినార్‌కు ఉద్దరాజు రామం ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త అశోక్ ధావలె మాట్లాడుతూ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, రైతాంగ ఉద్యమ నేత ఉద్దరాజు రామం, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహనీయులు నడియాడిన నేలకు తాను రావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయోద్యమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, అల్లూరితోపాటు లక్ష మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, 10 లక్షల మంది జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సుమారు 10 వేల మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. దేశంలో ట్రంప్ టారిఫ్ భారాలతో రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయిందన్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు నష్టపోతున్నారన్నారు. మోడీ నేతృత్వంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రభుత్వం మెజార్టీ లేక బీహార్‌లో నితీష్‌పై, ఆంధ్రాలో బాబుపై ఆధారపడి అధికారంలో ఉందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలో మొదటి ఐదు స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మధ్యప్రదేశ్ ఉన్నాయన్నారు. ఆకలి సూచిలో 123 దేశాల్లో 103వ స్థానంలో మన దేశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదరికం పెరుగుతుందన్నారు. కౌలు రైతులు ఆ కౌలు భూమిలోనే ప్రాణాలు వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తామని చెబుతున్న గిట్టుబాటు ధర ఎక్కడా ఇవ్వడం లేదని, క్వింటాకు రూ.3 వేలిస్తూ ఎంఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేరళ ప్రభుత్వం ఒక్కటేనన్నారు. మోడీ ప్రభుత్వం పదేళ్లలో రూ.16 లక్షల కోట్లు రుణ బకాయిలను కార్పొరేట్లకు రద్దు చేసిందన్నారు. రైతులకు మాత్రం ఒక్కరూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. నిరుద్యోగానికి, పేదరికానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలిచి పోరాడినప్పుడే మార్పు వస్తుందని కారల్ మార్క్స్ వందల ఏళ్ల క్రితమే దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. దేశంలో రైతాంగ పోరాటం ఆదర్శనీయమన్నారు. మోడీ మెడలు వంచిన ఘనత ఆ రైతాంగానికి ఉందన్నారు. నేడు లేబర్ చట్టాలు కుదించి నాలుగు కోడ్‌లుగా చేసి కార్పొరేట్లకు అనుకూలంగా మార్చారని మండిపడ్డారు. మోడీ నిరంకుశ పాలనపై సమరశీల పోరాటాలు, ఐక్య ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వ రంగాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అదే ఉద్దరాజు రామంకు ఇచ్చే ఘన నివాళులన్నారు. అనంతరం అశోక్‌ధావలెను ఘనంగా సత్కరించారు.

రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు

ఉద్దరాజు రామం ఫౌండేషన్ కార్యదర్శి, రైతుసంఘం రాష్ట్ర నేత బి.బలరాం



దేశంలో, రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై మా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుంది. ట్రంప్ టారిఫ్ వల్ల నష్టపోతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలి. పాడి, తమలపాకు, కోకో, ఆయిల్‌పామ్, మొక్క జొన్న, పొగాకు పంటల రైతులందరికీ ధర లేక ఇబ్బంది పడుతున్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి. ఎత్తిపోతల పథకాలను ప్రారంభించి సాగునీటిని అందించేలా ప్రభుత్వం కృషి చేయాలి. పోలవరం ప్రాజెక్టును తక్షణం పూర్తి చేయాలి. ప్రాజెక్టు పూర్తి చేయడం అంటే అక్కడి ప్రజలకు నష్టపరిహారంతో పాటు, పునరావాసం కల్పించడం. వివిధ అభివృద్ధి పనుల పేరుతో రైతుల నుంచి సేకరిస్తున్న భూములకు తగిన విధంగా నష్టపరిహారం ఇవ్వాలి. భూసేకరణ చట్టం 2013 ప్రకారం అమలు కావడం లేదు. రైతుల సమస్యలపై భవిష్యత్తులో రైతుసంఘం, కౌలురైతుల సంఘం, ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తాం.

ఢిల్లీలో నిర్మించే రైతు భవనానికి నిధి అందజేత

ఢిల్లీలో నిర్మిస్తున్న రైతు భవనానికి రైతు కార్యాచరణ సమితి నేతలు పాతపాటి మురళీ రామరాజు రూ.20 వేలు, కలిదిండి గోపాలకృష్ణంరాజు రూ.20 వేలు, పేరిచర్ల లక్ష్మణవర్మ రూ.10 వేలు మొత్తం రూ.50 వేలు అందించారు. అలాగే ఆర్.రఘురామరాజు రూ.25 వేలు అందించారు. ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ తరపున రూ.50 వేల చెక్కును ఫౌండేషన్ ఛైర్మన్, కార్యదర్శి, సభ్యుల చేతుల మీదుగా అశోక్‌ధావలేకు అందజేశారు.



వ్యవసాయంలో సోషలిస్టు చైనా విధానం మన దేశానికి ఆదర్శం

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



దేశంలో వ్యవసాయం చేసే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలకు సోషలిస్టు చైనా వ్యవసాయ రంగంలో తీసుకునే విధానాలు చాలా ఆదర్శనీయమని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. రైతులు వ్యవసాయం చేస్తే అమ్మి, గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత అక్కడి ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఆ దేశంలో వచ్చే ప్రతి నూతన టెక్నాలజీని వ్యవసాయానికి ఉపయోగిస్తారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఆ దేశ కుటుంబ సభ్యుల ఆదాయాలపై పరిశీలిస్తారని, ఒకవేళ తగ్గితే ఎందుకు తగ్గిందో అందుకు కారణాలు విశ్లేషించి తగ్గిన ఆదాయాన్ని నేరుగా బ్యాంకులో వేసే విధానం ఉందని వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న ఆరు కోట్ల మంది ప్రజల బాధ్యత ప్రభుత్వమే తీసుకొని వారికి అండగా నిలుస్తుందన్నారు. ఇంతలా రైతాంగానికి, ప్రజలకు సోషలిస్టు చైనా విధానాలు ఆదర్శంగా ఉంటే మన దేశంలోని ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047లో 10 శాతం మంది వ్యవసాయం చేస్తే చాలని చెప్పడం కార్పొరేట్లకు ఎంతలా ఊడిగం చేస్తున్నారో అర్థమవుతుందన్నారు.

రైతులకు అండగా రామం


ఉద్దరాజు రామం ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం



సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, రైతుగా ఉండి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న సమరయోధులు ఉద్దరాజు రామం. రైతుబిడ్డగా కనిపిస్తూనే తన కృషిని, ప్రతిభను అభివృద్ధి చేసుకుని జిల్లా రైతాంగ ఉద్యమ నేత నుంచి అఖిల భారత కిసాన్ సభకు జాతీయ అధ్యక్షులయ్యారు. జైలు జీవితం కూడా అనుభవించారు. పెద్దగా చదువుకోకపోయినా ఇంగ్లీష్, హిందీ భాషలపై పట్టు సాధించారు. ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ సేవలు జిల్లాలో ప్రారంభిస్తున్నాం. వ్యవసాయ రంగంలో హరిత విప్లవాన్ని తీసుకొచ్చిన మహాగొప్ప శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్. వ్యవసాయ రంగంలో రైతులకు అండగా ఆయన చేసిన కృషి ఎనలేనిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్.స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తే రైతు అభివృద్ధి చెందుతాడు. ఈ సెమినార్‌కు ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ఆహ్వానం పలకగా, ఎ.రవి వందన సమర్పణ చేశారు. సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, డి.కళ్యాణి, జుత్తిగ నరసింహామూర్తి, కోశాధికారి డిఎన్‌విడి.ప్రసాద్, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి చెరుకువాడ సుబ్రమణ్యంరాజు, మేళం దుర్గా ప్రసాద్, వీరబాబు, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కిలాడి శ్రీనివాస్, ప్రజాసంఘాల నేతలు కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, రామాంజనేయులు, ఎ.అజయకుమారి, పి.పూర్ణ పాల్గొన్నారు.

1న సిఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

ఉంగుటూరు మండలంలో డిసెంబర్ ఒకటో తేదీన సిఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై ఆమె అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ డిసెంబర్ ఒకటో తేదీన ఉంగుటూరు మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సిఎం చంద్రబాబు పాల్గొంటారన్నారు. సామాజిక పెన్షన్ల పంపిణీ, బంగారు కుటుంబాలను కలిసి, మార్గదర్శకులతో సమావేశమయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందన్నారు. గొల్లగూడెం, గోపీనాథపట్నంల్లో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలీప్యాడ్, సభాస్థలి ప్రాంతాలను అధికారులు పరిశీలించి, ఏర్పాట్లకు అనువైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని, వాటిని ఆమోదం కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపాల్సి ఉందని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఎంజె.అభిషేక్ గౌడ, జెడ్‌పి సిఇఒ శ్రీహరి, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గొల్లగూడెంలో బహిరంగ సభ, టిడిపి ముఖ్య కార్యకర్తల సమావేశం, హెలీప్యాడ్ తదితర ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యాలయ సమన్వయ అధికారి రఘు, ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఆర్‌డిఒ డాక్టర్ అచ్యుత అంబరీష్, డిఎస్‌పి శ్రావణ్ కుమార్ పరిశీలించారు. గొల్లగూడెం-నల్లమాడు మార్గంలో లే అవుట్‌లోని ఖాళీ మైదానంలో కార్యకర్తల సమావేశం, దానికి సమీపంలో హెలీప్యాడ్, గొల్లగూడెం-రామచంద్రాపురం మార్గంలోని పొలాల్లో బహిరంగ సభ ఏర్పాటుకు అధికారులు అనువైన ప్రాంతాలుగా గుర్తించారు. హెలీప్యాడ్ నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బి అధికారులు చేపట్టారు. చేబ్రోలు నుండి గొల్లగూడెం తారురోడ్డు పలుచోట్ల గోతులు పడ్డాయి. వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 29 నుండి తుపాను ప్రభావం ఉండొచ్చని సమాచారంతో దానికి అనుగుణంగా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఇరిగేషన్ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా ఇరిగేషన్ సలహా మండలి సమావేశం ఈ నెల 28వ తేదీ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ శాఖ ఎస్ఇ దేవప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ పత్రాల దహనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



పత్రాలు దహనం చేస్తున్న నేతలు

కార్మికులకు, రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు, ప్రజలకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వసంత మహల్ సెంటర్లో లేబర్‌కోడ్ పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, అమిత్‌షా నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా వ్యతిరేక విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని విమర్శించారు. కార్మికవర్గం అనేక పోరాటాలు చేసి, ఉద్యమాలు నిర్వహించి తరతరాలుగా సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో ప్రధానమైన 29 చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లు, పెట్టుబడిదారీ యజమానులకు మేలు చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా బిజెపితో చేతులు కలిపి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. రైతుల భూములను గుంజుకుని కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పని చేసుకుని పొట్ట నింపుకునే వ్యవసాయ కూలీలు, పేదలు, దళితులకు అన్యాయం చేసేలా ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయింపులు తగ్గించి మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఏలూరు నగర నాయకులు వైఎస్.కనకారావు మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎ.శ్యామలారాణి, పిచ్చుక ఆదిశేషు, ఎం.ఇస్సాక్, జె.గోపీ, అరుణ కుమారి, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పి-4కు బాసటగా నిలవాలి

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యతిచ్చే పి-4 కార్యక్రమానికి అంతా బాసటగా నిలవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు అధికారులు పెద్ద మనస్సుతో ముందుకు రావాలని కోరారు. అంతా ముందుకొస్తే తన తొలిసాయంగా రూ.పది లక్షలు అందిస్తానని తెలిపారు. పి-4 కార్యక్రమంపై అధికారులతో మంత్రి పార్థసారథి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి కోసం పబ్లిక్, ప్రయివేటు పీపుల్స్ పార్టనర్‌షిప్ ఫోరంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకు అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధిపథంలో నిలిపేందుకు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నారన్నారు. పరిశ్రమల స్థాపనతో రాష్ట్రంలోని యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. పోలీసు వ్యవస్థ పనితీరు అభినందనీయమని, దొంగతనం జరిగిన కొన్ని గంటలకే నగదును, బంగారాన్ని రికవరీ చేసి, దొంగలను అరెస్టు చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. పేదలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు పి-4 ప్రారంభించామని, ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, పారిశ్రామికవేత్తలు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నేతలు

రామం ఆదర్శాలను నేటి తరం పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్దరాజు రామం ఆశయాలను, ఆదర్శాలను నేటితరం పాటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ అన్నారు. స్వాతంత్ర సమరయోధులు, రైతు ఉద్యమ నిర్మాత ఉద్దరాజు రామం 30వ వర్ధంతి సభ గురువారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఎం.ఇస్సాక్ అధ్యక్షతన జరిగింది. తొలుత ఉద్దరాజు రామం చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు పిచ్చుక ఆదిశేషు, సిటీ నాయకులు వైఎస్.కనకారావు పూలమాల వేయగా, మిగిలిన కార్యకర్తలు పూలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉద్దరాజు రామం జిల్లాలో, రాష్ట్రంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుల్లో ఒకరని, రైతు ఉద్యమ నిర్మాతని, అఖిల భారత కిసాన్ సభకు జాతీయ అధ్యక్షునిగా పనిచేశారని అన్నారు. సిపిఎం ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా కూడా పని చేశారని తెలిపారు. 1957-62 మధ్యకాలంలో నరసాపురం ఎంపీగా ఉన్నారని, సముద్రం పాలవుతున్న గోదావరి జలాల వినియోగానికి చక్కటి మార్గం చూపారని, పార్లమెంటులో రైతు, ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన కలలు కన్న, కోరుకున్న సమ సమాజ స్థాపనకు కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎ.శ్యామలారాణి, నగర నాయకులు జె.గోపి, జి.కోటేశ్వరరావు, చింతాడ లక్ష్మి, మీసాల సత్యం, జి.ఏసుబాబు, సిహెచ్.అమర్ కుమార్, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి వసతులు లేకపోతే పాఠశాల గుర్తింపు రద్దు

డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - టి.నరసాపురం



విద్యార్థులకు వడ్డిస్తున్న డిఇఒ

ప్రయివేటు పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు లేకపోతే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తానని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ హెచ్చరించారు. గురువారం స్థానిక శ్రీ సాయి సూర్య పబ్లిక్ స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల విద్యార్హతతోపాటు పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో పరిసరాలు, వసతులు సక్రమంగా లేవని, వారం రోజుల్లో సరిచేసుకోకపోతే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తానని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. కనీసం 20మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుచికరంగా మధ్యాహ్న భోజనం

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి




భోజనం రుచి చూస్తున్న ఎంఎల్ఎ

పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచిగా ఉందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశా లను ఆయన గురువారం సందర్శించారు. అక్కడ కిచెన్ షెడ్డులోకి వెళ్లి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. వంట షెడ్యూలో పరిశుభ్రత తదితర అంశాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట వారిని ప్రశంసించారు. అన్నం నాణ్యత, కూరల రుచి చాలా చక్కగా ఉందని, ఎప్పుడూ ఇలానే విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించడం లో వెనకడుగు వేయొద్దని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని దీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



దీక్షలో కూర్చున్న నేతలు

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు జెఎసి, బార్ అసోసియేషన్, పీపుల్స్ ఫోరం, అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్షలు ప్రారంభించారు. దీక్షలను జెఎసి గౌరవాధ్యక్షులు చలసాని వెంకట రామారావు, కెడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నూజివీడు జెఎసి అధ్యక్షులు చలసాని రామారావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని గతంలో ఎన్నో పోరాటాలు చేశామన్నారు. నేతలు మరీదు శివరామకృష్ణ, ఇందుపల్లి సత్య ప్రకాష్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని పలుసార్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు, నేతలు పిన్నమనేని కుమార్, సబ్బినేని శ్రీనివాస్, సిద్ధార్థ రవి, రాజశేఖర్, ఫరూక్, చాట్ల పుల్లారావు, ఎం.సునీల్‌కుమార్, ఎర్రంశెట్టి రాము, మన్నం రమేష్, వైఎస్ దొరయ్య, సిహెచ్.అర్జున్‌రావు, వై.హరిబాబు, జాన్‌బాబు, సిహెచ్.తేజచంద్, సుధాకర్, బసవరాజు రామకృష్ణ, వీరభద్రరావు, నాగూర్, బాజీ, కె.చంద్ర పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్‌టిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



దీక్షలో కార్మికులు

ఏలూరు ఆర్‌టిసి పెట్రోల్ బంకులో జరిగిన కుంభకోణంలో అవినీతి పరులను వెనకేసుకొస్తున్న యాజమాన్య వైఖరిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని, దోషులను శిక్షించి అక్రమంగా సస్పెండ్ చేసిన నలుగురు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి అధికారుల వైఖరికి నిరసనగా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఏలూరు డిపో వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. శిబిరాన్ని కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంక్ లో జరిగిన సుమారు రూ.83 లక్షల అవినీతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. దీనిలో సంబంధం లేని వ్యక్తులను సస్పెండ్ చేయడం యాజమాన్య వైఖరిపై అనుమానాలు రేకెత్తిస్తోందన్నారు. దీక్షల్లో డి.శ్రీరాములు, కె.ప్రదీప్, ఎ.మీనా, పి.ప్రభావతి, జివి.శాస్త్రులు, పిఎస్.బాబు, జి.ఈశ్వరరావు, బిఎస్.కళ, బిఎస్.నారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఇయు, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఇతర కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడాలి : యుటిఎఫ్


ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం రవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. యుటిఎఫ్ మండలాధ్యక్షునిగా ప్రేమ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చెంచాం రాజు ఎన్నికయ్యారు. నూతన కోర్ కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షులుగా వి.హేమ్లానాయక్, సహాధ్యక్షులుగా జె.రంగయ్య, సహాధ్యక్షురాలిగా ఎ.వాణి, కోశాధికారిగా కె.బుచ్చిబాబు ఎన్నికయ్యారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - కామవరపుకోట

వృత్తి విద్య కోర్సులతో మహిళలకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ పీతల సుజాత అన్నారు. మండలంలోని తడికలపూడిలో ఉన్న మహిళా ప్రాంగణంలో వివిధ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించడంతో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీతో పాటు పీతల సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బ్యూటీషియన్, టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసిన 93 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు స్వయం ఉపాధితో పాటు ప్రత్యేక నైపుణ్యాలు నేర్చుకుని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. నిరుద్యోగ మహిళలు వృత్తివిద్య ఆర్థికంగా, స్వతంత్రంగా మారతారని తెలిపారు. నిరుద్యోగులైన మహిళలు వృత్తివిద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ డాక్టర్ జుబేదా పర్వీన్, గతంలో శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందిస్తున్న సుజాత, పద్మశ్రీ

బుజ్జికి శాప్ డైరెక్టర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరానికి చెందిన రిపోర్టర్ అయినపర్తి బుజ్జి ఇటీవల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో తలకు ఆపరేషన్ అయింది. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. బుజ్జి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యుల నుంచి తెలుసుకున్న ఆమె, చేగొండపల్లిలో గురువారం పార్టీ కార్యాలయం వద్ద ఆర్థిక సాయాన్ని అందించారు. ప్రమాదంలో గాయపడిన బుజ్జికి సహాయం అందించడంపై కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్థిక సహాయం అందిస్తున్న జగదీశ్వరి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రభుత్వం మంజూరు చేసిన మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపిపి రామారావు తెలిపారు. మండలంలోని కన్నాపురంలో రూ.ఐదు లక్షలతో నిర్మిస్తున్న డ్రెయిన్ పనులకు నాయకులతో, అధికారులతో కలిసి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని మంజూరు చేసిన ఈ డ్రెయిన్ పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. విద్యార్థులు నడవటానికి వీలుగా డ్రెయిన్‌పై మూతలు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. పరింపూడి విశాల సహకార సంఘం అధ్యక్షుడు దున్నా శ్రీను మాట్లాడుతూ కన్నాపురం గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. ఎంఎల్ఎ నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నారు. పాఠశాల మార్గంలో అర్‌ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారు. ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళి, గ్రామ కార్యదర్శి యు.గంగాధర్, పాఠశాల హెచ్‌ఎం యు.రాజకుమార్, ఆంధ్రప్రదేశ్ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జనరల్ సెక్రటరీ టివిఎన్.స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల డోర్ టు డోర్ సర్వే

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని బత్తులవారిగూడెం గ్రామంలో రైతన్న మీకోసం ఇంటింటి సర్వే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 12723 కుటుంబాలకు ఇప్పటివరకు 9830 కుటుంబాలకు సర్వే పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా, ఎడిఎ నూజివీడు, మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, ఎంపిడిఒ, తహశీల్దార్, ఎంపిపి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం ద్వారా రైతు ఇంట ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి ఆధ్వర్యంలో గురువారం డోర్ టు డోర్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కావ్య కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కొన్నూరుగూడెంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల పదో విద్యార్థిని పొడపాటి కావ్య కుటుంబాన్ని ఎస్‌సి కమిషన్ మాజీ ఛైర్మన్, అడ్వకేట్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పరామర్శించారు. స్కూల్ సిబ్బంది తమ కుమార్తె మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌లో వదిలేసి వెళ్లిపోయారని కుటుంబసభ్యులు చెప్పారు. కావ్య తండ్రిని ఆదివారం కార్యాలయానికి తీసుకెళ్లి ఒత్తిడి చేసి సంతకాలు తీసుకున్నారని మృతురాలి బంధువులు వారికి వివరించారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ కావ్య మరణానికి స్కూల్ సిబ్బంది ప్రిన్సిపల్, టీచర్లపై కఠిన కేసులు నమోదు చేసి న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఉన్నారు.


కుటుంబాన్ని పరామర్శిస్తున్న విక్టర్‌ప్రసాద్

నేరాలు - ఘోరాలు

గుండాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గుండాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెడ్డు గ్రామంలో గుండాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

టేకు కలప స్వాధీనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కొయ్యలగూడెం మండలంలోని పరింపూడి సమీపంలోని ఓ కోత మిషన్ నుంచి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు టేకు కలపను తరలిస్తున్న ఆటోను జీలుగుమిల్లి అటవీ శాఖ చెక్ పోస్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అటవీ శాఖ రేంజ్ అధికారి దుర్గాకుమార్ వివరాల ప్రకారం... కొయ్యలగూడెం మండలంలోని పరింపూడి సమీపంలో ఉన్న కోత మిషన్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని మణుగూరుకు ట్రక్ ఆటోలో అనధికారికంగా తరలిస్తున్న 42 దిమ్మెలను జీలుగుమిల్లి అటవీ శాఖ చెక్ పోస్ట్ సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో సెక్షన్ అధికారి కె.రాజాబాబు, చెక్ పోస్ట్ సిబ్బంది రాఘవ, రెహమాన్ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నూజివీడు నియోజకవర్గంలో 74 మందికి సుమారు రూ.35.56 లక్షలు సిఎం సహాయ నిధి చెక్కులను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అత్యవసర సమయంలో నిరుపేదలు ప్రయివేట్ వైద్యం చేసుకునేందుకు సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో పేదవారు డబ్బులు లేక వైద్యానికి దూరం కాకూడదని ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. రాష్ట్ర పేద ప్రజల పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు వైద్యబిల్లులను తమ కార్యాలయంలో అందిస్తే సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం వెంటనే అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఎల్‌డిఒ పి.వెంకటరత్నం, తహశీల్దార్ జి.బద్రు, ఎంపిడిఒ సిహెచ్.రాఘవేంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో రూ.20 లక్షలతో ఆధునీకరించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభోత్సవం, రూ.25 లక్షలతో సమావేశ మందిరానికి శంకుస్థాపన, రూ.3.50 లక్షలతో నియోజకవర్గ అభివృద్ధి - ప్రణాళిక కార్యాలయం ప్రారంభోత్సవాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ అభివృద్ధి - ప్రణాళిక కార్యాలయంలో ఆంధ్ర 2047 యాక్షన్ ప్లాన్, ప్రజా దర్బార్ పిజిఆర్ఎస్ అర్జీలపై సంబంధిత అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి నియోజకవర్గ స్థాయిలో అమలును పర్యవేక్షించడానికి, పురోగతిని ట్రాక్ చేయడానికి విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లను ఏర్పాటు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలతో సమన్వయం చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధిని సాధిస్తామని తెలిపారు. వారం వారం ప్రజా దర్బార్ నిర్వహిస్తామని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకీ నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. 60 రోజులు దాటిన పరిష్కారం కాకపోతే తాను స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరిస్తానన్నారు.

పట్టణంలో పంచాయతీ రాజ్ డివిజనల్ కార్యాలయం, మండలంలోని బత్తులవారిగూడెంలో పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, పిహెచ్‌సి, రేగుంట గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి మంత్రి కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఏడాదిన్నర పాలనలోనే ఎన్నో విజయాలు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఎంపిఎల్ సుందరి, తహశీల్దార్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్ అన్నారు. మండలంలోని తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాల్ ల్యాబ్, కిచెన్ గార్డెన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు రమేష్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణ సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసిఇబి ఛైర్మన్ అంగులూరి సర్వేశ్వరరావు, సర్పంచి కొత్తపల్లి రజిని శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు కొప్పర్తి లక్ష్మి, గంగులు కడియాలు, తూతా బాలాజీ కుమార్, మెరుగు సుందర్‌రావు, నందిగాం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయ కేతనం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. పట్టణంలోని జెడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులందరికీ ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా తయారుచేసిన విజయ కేతనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రణాళిక బద్ధంగా చదువుకుని మంచి మార్కులతో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు అందిస్తుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 మందికి ఉచిత హెచ్‌పిఎల్‌సి రక్త పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా సెంటర్‌లో గురువారం తలసేమియా బాధిత చిన్నారులకు, వారి కుటుంబ సభ్యులకు మొత్తం 30 మందికి హెచ్‌పిఎల్‌సి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా వంటి రక్త సంబంధిత వ్యాధుల కచ్చితమైన నిర్ధారణకు హెచ్‌పిఎల్‌సి పరీక్ష అత్యంత కీలకమైందన్నారు. ఈ పరీక్ష ద్వారా రక్తంలో ఉన్న హిమోగ్లోబిన్ రకాలను గుర్తించడానికి, వివిధ హీమోగ్లోబిన్ భాగాల శాతం స్పష్టంగా ఎంతుందో అంచనా వేయగలిగే అవకాశం ఉండటంతో, తలాసేమియా మైనర్, ఇంటర్మీడియట్, మేజర్ రకాలను సులభంగా నిర్ధారించవచ్చన్నారు. అనంతరం ఆరుగురు తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ సిస్ర ఆల్బర్ట్, హెడ్ నర్స్ ఎం.శాంతకుమారి, ల్యాబ్ టెక్నీషియన్లు ఎన్.విజయ, పి.సునీల్ పాల్గొన్నారు.

శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ ఎఒగా శ్రీనివాసరావు


కలిదిండి : స్థానిక శ్రీ పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా శింగనపల్లి శ్రీనివాసరావు ఉద్యోగోన్నతిపై నూతనంగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న వివిఎస్‌కె.శేఖర్ ఉద్యోగోన్నతిపై విన్నకోట గ్రూపు దేవాలయాలకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం శింగనపల్లి శ్రీనివాసరావు వడాలి శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం, గురజ దేవాలయములకు అదనపు బాధ్యతలో ఉన్నారు.

ప్రజారోగ్యానికి కూటమి పెద్దపీట

పిహెచ్‌సి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని బట్టువారిగూడెం వెళ్లే దారిలో రూ.1.40 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడికి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మాణానికి స్థలం చూశామన్నారు. దాదాపు పది వేల మందికి వైద్య సదుపాయాలు అందుతాయఅన్నారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలం ఇవ్వడానికి సహకరించిన రజకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చింతలపూడి నగర పంచాయతీకి రూ.నాలుగు కోట్ల జెడ్‌పి నిధులు మంజూరయ్యాయని, త్వరలో రోడ్లన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు చింతం విష్ణుమూర్తి, జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

కబ్జా భూమిని తిరిగివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అక్రమంగా కబ్జా చేసిన దళిత మహిళకు చెందిన భూమిని తిరిగి ఆమెకు ఇప్పించాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన నాయకులు నేతల రమేష్‌బాబు మాట్లాడుతూ కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన ఎస్‌సి మాల సామాజిక తరగతికి చెందిన కొణుదుల విజయకు చెందిన 5.14 సెంట్ల వ్యవసాయ భూమిని కబ్జా చేసిన తడికలపూడి గ్రామానికి చెందిన కూరాకుల శ్రీనివాసరావుపై, ఆళ్ల రంగారావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని, వారు కబ్జా చేసిన వ్యవసాయ భూమిని తిరిగి కొణుదుల విజయకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు కొణుదుల విజయ, దళిత నాయకులు ఎరికిపాటి విజయ్, కంచర్ల విజయశేఖర్, బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'పిఎం ఆవాస్ యోజన' సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం సేవలను వినియోగించుకోవాలని ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్ చైతన్య ఆధ్వర్యంలో సచివాలయాల్లో పనిచేసే ఇంజినీరింగ్ సహాయకులకు, భీమడోలు కార్యాలయ అధికారులు సిబ్బందికి పథకాన్ని వేగవంతంగా అమలు చేసేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇదే క్రమంలో వీరు సమాచార హక్కు చట్టం- 2005పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తవాలను ఫిర్యాదుదారులకు సత్వరమే తెలియజేసేందుకు తీసుకునే చర్యలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిడిఒ పథకం దరఖాస్తుల నమోదుకు సచివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. దరఖాస్తుదారులు అవసరమైన సమాచారంతో వారిని సంప్రదించాలని కోరారు. గృహ నిర్మాణ సంస్థ భీమడోలు సహాయ ఇంజినీర్ చైతన్య మాట్లాడుతూ పథకపు లబ్ధి కోసం ఇప్పటివరకు 191 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 30 లోగా అర్హులైన ఇతర లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే విధంగా చైతన్య పరచాలని కోరారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ పద్మావతిదేవి

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. ఉంగుటూరులోని క్యాంపు కార్యాలయంలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమానికి సంబంధించి ప్రచార పత్రాలను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలను అరికట్టడానికి వంద రోజుల పాటు వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు సిడిపిఒ ఎంఎస్.రాజశేఖర్, సూపర్‌వైజర్లు బివి.శ్రీలక్ష్మి, ఎం.భాగ్యలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

భీమడోలు : బాల్య వివాహాలు వద్దు- నిర్ణీత వయసు వచ్చిన తర్వాత వివాహాలు ముద్దు అని ఎంపిడిఒ పద్మావతి దేవి అన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు కోసం రూపొందించిన బాల్య వివాహ ముక్త్ భారత్ పదకపు ప్రచార వాల్‌పోస్టర్‌ను మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సభ్యులు అధికారి గురువారం ఆవిష్కరించారు. ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు సిడిపిఒ ఎంఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ హాజరై మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని, సహకరించాలని కోరారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ఐసిడిఎస్ విద్య, ఆరోగ్యం గ్రామపంచాయతీ శాఖల సంయుక్త సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ట్ డైరెక్టర్ రవి, ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు పర్యవేక్షకులు రూప, నూర్జహాన్ బేగం, ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి శర్మ పాల్గొన్నారు.

జగన్మోహన్‌రావు ఆశయాలు స్ఫూర్తిదాయకం

సంస్మరణ సభలో ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రముఖ వైద్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ అంబాసిడర్ ఆఫ్ గుడ్ విల్ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన్‌రావు ప్రథమ వర్ధంతి సంస్మరణ సభ గురువారం స్థానిక హేలాపురి లయన్స్ క్లబ్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు బివివి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం, విద్య కోసం నిరంతరం శ్రమించి యార్లగడ్డ నెలకొల్పిన విద్యాలయాలు, వైద్యాలయాలు నేడు ఎంతో మందికి తమ సేవలు అందిస్తున్నాయని కొనియాడారు. యార్లగడ్డ ఖ్యాతి లయనిజం ఉన్నంత కాలం నిలచి ఉంటుందని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని లయన్స్ సభ్యులు ముందుకు నడవాలన్నారు. లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ బాబు, పూర్వపు డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్, జిల్లా గవర్నర్ ఎన్‌వివిఎస్.పాపారావు నాయుడు, జిల్లా నాయకులు లేళ్ల వెంకటేశ్వరరావు, జగన్మోహన్‌రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వసతి గృహ పున:ప్రారంభానికి కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి : కుక్కునూరు మండలం అమరవరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహ పున:ప్రారంభానికి తన వంతు కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. వసతి గృహంలో చదువుకున్న పలువురు పూర్వ విద్యార్థులు ఎంఎల్ఎ చిర్రి బాలరాజును బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందించినట్లు జనసేన చింతలపూడి నాయకులు మేకా ఈశ్వరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ అమరవరం పరిసర గ్రామా ల్లోని దళిత, గిరిజన పిల్లలకు వసతి గృహం అందుబాటులో లేక దూర ప్రాంతాలకు వెళ్లి ఉండలేక చదువు మానేస్తున్నారని వివరించారు. గతేడాదిలో వసతి గృహం ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభమైందని, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ డైరెక్టర్ పేచీలో ఫైల్ ఉందని చెప్పారని, ఉన్నతా ధికారులతో మాట్లాడి వసతి గృహ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ తెలిపారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో పూర్వ విద్యార్థి, జనసేన నాయకులు మేకా ఈశ్వర య్య, వసతి గృహ పూర్వ వార్డెన్ తంబళ్ల కన్నయ్య, వసతి గృహ పునరు ద్ధరణ కమిటీ కన్వీనర్ ఆర్.వెంకట్, పూర్వ విద్యార్థులు శనగ వెంకటేశ్వర్లు, మడిపల్లి వెంకటేశ్వరరావు, బుయ్యిన నాగేశ్వరరావు ఉన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలకు చెందాల్సిన సొత్తును దొంగదారిలో కాజేయాలని చూస్తే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు చేపడతామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హెచ్చరించారు. కోడేలులోని హౌసింగ్ లే అవుట్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఒక ప్రయివేట్ గోడౌన్‌లో దాచి ఉంచిన గృహ లబ్ధిదారులకు చెందిన కొత్త డోర్‌లు, కరెంట్ మెటీరియల్‌ను పరిశీలించారు. వీటి లెక్కలు ఇప్పటివరకూ ఎందుకు బహిర్గతం చేయలేదంటూ అధికారులను ప్రశ్నించారు. తిరిగి ఆయా పనులకు ఎందుకు డబ్బు ఖర్చుపెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ అధికారులు మూడేళ్ల క్రితం తెచ్చిన ఏలూరు మండలానికి చెందిన గృహ లబ్ధిదారులకు చెందిన కొత్త డోర్లు, కరెంట్ మెటీరయల్స్‌ను కొందరు అవినీతి ఉద్యోగులు తరలించుకుపోతున్నారన్న విషయం తెలుసుకున్న ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హుటాహుటిన స్థానిక కోడేలులోని హౌసింగ్ లే అవుట్‌కు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో ఒక ప్రయివేట్ గోడౌన్‌లో దాచి ఉంచిన మెటీరియల్‌ను పరిశీలించిన ఆయన, వాటి లెక్కలపై, అగ్రిమెంట్ లేకుండా ప్రయివేట్ లే అవుట్‌లో వీటన్నింటినీ ఎందుకు ఉంచారంటూ ప్రశ్నించారు. దాదాపుగా 15,536 మంది లబ్ధిదారులకు చెందిన రూ.8.25 కోట్ల విలువైన సొత్తును ఎందుకు మురగబెడుతున్నారో వారే చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపడతామన్నారు. వీటిని రాయితీ ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు టిడిపి నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, తదితరులు ఉన్నారు.

పెట్రోల్, డీజిల్‌పై సెస్ విధించాలనుకోవడం సరికాదు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దిగజారిపోతున్న రాష్ట్ర రవాణా రంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు మళ్లీ పెట్రోల్, డీజిల్‌పై సెస్‌లు విధించాలని, నిర్మించిన రహదారులకు టోల్‌గేట్ వసూలు చేయాలని నిర్ణయించడాన్ని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జె.గోపీ, చక్రాల అమర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్అండ్‌బి శాఖ సమీక్ష సమావేశంలో సిఎం చంద్రబాబు రాష్ట్రంలోని రోడ్ల పరిస్థితిని సమీక్షించి నిధుల సేకరణ కోసం పెట్రోల్, డీజిల్‌పై సెస్ విధించాలని, రాష్ట్రంలోని 1500 కిలోమీటర్ల రహదారులను మూడు దశల్లో నిర్మించాలని, నిర్మించిన రహదారులకు టోల్ వసూలు చేయాలని నిర్ణయించడాన్ని రాష్ట్ర ప్రజలు అనుమతించబోరని తెలిపారు. ఈ విధంగా సెస్సులు పెంచుకుంటూ పోతే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారి నిత్యావసర సరుకులపై ప్రభావం చూపుతుందని, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రహదారులను ప్రభుత్వం మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట రోడ్లను విస్తరణ చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, రోడ్ టాక్స్, ఇన్సూరెన్స్ వంటి ఛార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు.

రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ పర్యటన వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో ఈ నెల 28వ తేదీన పర్యటించాల్సిన రాష్ట్ర షెడ్యూల్డ్ కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్ పర్యటన వాయిదా పడినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వాయిదా పడినట్లు పేర్కొన్నారు.

వారం రోజుల పాటు స్నేహపూర్వక తనిఖీలు

జిల్లా ఇన్‌ఛార్జి డిటిసి కృష్ణారావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో విద్యాసంస్థల బస్సుల్లో భద్రతా లోపాలపై స్నేహపూర్వక తనిఖీలు వారం రోజుల పాటు నిర్వహిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి ఉప రవాణా కమిషనర్ కృష్ణారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికి కూడా కొన్ని విద్యాసంస్థల బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు రవాణా శాఖ అధికారులు గుర్తించారని తెలిపారు. వీటిని అధిగమించేందుకు స్నేహపూర్వక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హోమియో ఆసుపత్రి భవన నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి - కామవరపుకోట

హోమియో ఆసుపత్రి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయుష్ శాఖ ఆర్‌డిడి కెవి.కుమార్‌బాబు అన్నారు. మండలంలోని తడికలపూడిలో ఉన్న హోమియో ఆసుపత్రిని ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రి హోమియోపతి వైద్యరాలు రఫియా పర్వీన్ షేక్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గతంలో ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కేటాయించిన బండెల దొడ్డి ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

నాలుగు లేబర్ కోడ్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సత్వరమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రమణక్కపేటలో గురువారం ఎఐసిటియు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐసిటియు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ కార్మిక హక్కులను హరిస్తూ ఏకపక్షంగా కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తూ నాలుగు కోడ్లు రూపొందించిందన్నారు. వీటిని ఐక్య పోరాటాల ద్వారా తిపి కొట్టాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యుడు సువర్ణగిరి వెంకట శోభన్ కుమార్ ఇటీవల మృతి చెందాడు. ది కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మచిలీపట్నం ఛైర్మన్ నెట్టెం రఘురాం ఆదేశాల మేరకు సిఇఒ అమృతలూరు శ్యామ్ మనోహర్ ఉత్తర్వుల ప్రకారం సదరు సభ్యుని భార్య సువర్ణగిరి మాలతికి నూజివీడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున సంఘ ముఖ్య కార్య నిర్వహణాధికారి నీలం నాగేశ్వరావు చేతుల మీదుగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పదివేలు అందించారు.

షేక్ ఇబ్రహీం సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామీణ వైద్యులుగా షేక్ ఇబ్రహీం సేవలు ఎనలేనివని వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెరికేగూడెం గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం ఇటీవల మృతి చందారు. గురువారం నిర్వహించిన చాలిస్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇబ్రహీం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు చేబోయిన వీర్రాజు, రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి ఎండి గాలిబ్ బాబు, కైకలూరు మండలాధ్యక్షులు సింగంశెట్టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దె రఘుబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రమైన ముసునూరు పోలీస్ స్టేషన్ సెంటర్‌లో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, వ్యాపార వేత్తలు, ప్రజా సంఘాల నాయకులు, అధికారులు, విలేకరులు, తదితరులు పాల్గొని రఘుబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.